
ప్రజాశక్తి
గురువారం 5 డిసెంబర్ 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కందుకూరు: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం దిగుబడి ఆధారిత అనగా పంటల బీమా పథకం కింద కొన్ని మార్గదర్శకాలు చేసిందని కందుకూరు ఎడిఎ అనసూర్య తెలిపారు. జిల్లాలో ఈ రబీ సీజన్‌కు 5 పంటలు వరి, మినుము, సెనగ, పెసర, వేరుశనగ పంటలు ఎంపిక చేయ బడ్డాయన్నారు. జిల్లాలో దిగుబడి ఆధారిత పంటల బీమా వర్తిస్తుందన్నారు. ఈ ఎంపిక చేయబడిన 5 పంటలలో వరి పంట కోసం గ్రామాన్ని ఒక యూనిట్ గా మినుము, సెనగ పంటలు మండలం యూనిట్‌గా పెసర , వేరుశనగ పంటను జిల్లా యూనిట్ గా బీమా పథకం అమలు చేయబడతాయని తెలిపారు. ఈ పథకం క్రింద వరి పంట కొరకు రైతు చెల్లించవలసిన ప్రీమియం వాటా ప్రతి ఎకరానికి 168 రూపాయలు, మినుము 38 రూపాయలు,సెనగ 56 రూపాయలు, పెసర 36 రూపాయలు ,వేరుశనగ 60 రూపాయలు గా నిర్ణయించినట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


అనసూర్య , ఎడిఎ

ప్రజలకు కరెంట్ బిల్లుల షాక్..!

ట్రూఅప్ ఛార్జీల వడ్డన - జనవరిలో మరోసారి దోపిడీకి రంగం

ప్రభుత్వాలు ఏవైనా ప్రజలకు భారాలు మాత్రం మామూలే.. ప్రతిపక్షంలో ఒకమాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట.. ఇది పరిస్థితి.. జగన్ ప్రభుత్వం భారీగా కరెంట్ ఛార్జీలు పెంచుతుందని, అప్పుడు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ గగ్గోలు పెట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం జిల్లా ప్రజలకు కరెంట్ బిల్లులు షాక్ ఇచ్చింది. ట్రూఅప్ ఛార్జీలు వడ్డించింది. జనవరి తరువాత మరోసారి వడ్డించడానికి సిద్ధమవుతోంది.ఈ బాదుడు 2026 వరకు కొనసాగుతుందని తెలుస్తోంది. ఒకటో తేదీ కరెంట్ బిల్లులు చూసిన జనం గగ్గోలు పెడుతున్నారు. జగన్ కంటే తలదన్నేలా చంద్రబాబు తయారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా జిల్లా వ్యాప్తంగా రూ.253 కోట్లు కరెంట్ బిల్లులు వసూళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు రూ.11 నుంచి రూ.13 కోట్లు అదనపు భారం వేసినట్లు తెలుస్తోంది..



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కాదు కాదు అంటూనే కరెంట్ బిల్లులు పెంచేసింది. ట్రూఅప్ ఛార్జీలు పెంచొద్దని, ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని మాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు అదే చేసింది. 2022-23కు సంబంధించిన వివిధ రకాల విద్యుత్ బిల్లులు పెంచింది. జనవరి తరువాత 2023-24కు సంబంధించిన సర్దుబాటు చేసుకోడానికి సిద్ధమవుతోంది.ఇప్పటికే ప్రజలు నిత్యావసర వస్తువులు, ఇతర ధరలు పెరిగి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో కరెంట్ బిల్లులు పెంచడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎవరైనా మాకు భారాలు తప్పడంలేదన్నారు. నెల్లూరు నగరంలోని ఒక ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఇంటిలో కేవలం ఒక్క యూనిట్ కరెంట్ వాడారు. ఈనెల బిల్లు రూ.401 వచ్చింది. అసలు కరెంట్ వాడని ఇంటికి ఇంత బిల్లావడంతో ఆందోళన వ్యక్తం చేశారు.ఏం జరిగిందోనని విచారిస్తే అసలు విషయం బయటపడింది. ఇటీవల కాలంలో ఇప్పటి వరకు వినియోగించిన విద్యుత్‌కు రకరకలా ఛార్జీలు కలిపి బిల్లు చేతిలో పెట్టారు. ఎనర్జీ ఛార్జీలు రూ.13.30, ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ.10, కస్టమర్ ఛార్జీ రూ.25, ఎఫ్‌పిపిసిఎ (20022-04) రూ.256, ట్రూఅప్ ఛార్జీలు రూ.93.34 మొత్తం కలిపి రూ.401 బిల్లు చేతిలో పెట్టారు. ఇలాంటి విద్యుత్ బిల్లులు జిల్లా అంతటా ఉద్యోగులు వినియోగదారులకు అందిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి కేవలం ఆరు నెలల గడవక ముందే విద్యుత్ బిల్లులు భారీగా చేతిలో పెట్టారు. జనవరిలో మరో సారి భారీగా బిల్లులు పెంచనున్నారు.

రూ.ప్రతి నెలా రూ.253 కోట్లు..!

విద్యుత్ బిల్లులు భారీగా పెరిగాయి. ట్రూఅప్ ఛార్జీలతో పాటు వివిధ రకాల పేరుతో వడ్డించారు. జిల్లా వ్యాప్తంగా 12,80,690 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో వ్యవసాయ 1.99.989 ఉండగా, గృహ కనెక్షన్లు 9.36.082 ఉండగా, కమర్షియల్ 1.06,718 ఉన్నాయి. కేటగిరి -3 కింద అంటే పైన బిల్లులు, ఇతర సంస్థల 4148 కనెక్షన్లు ఉండగా, ప్రభుత్వ వీధి దీపాలు, నీరు కనెక్షన్లు 26,318 వరకు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రతి రూ.253 కోట్లు విద్యుత్ బిల్లుల రూపంలో ఆ శాఖలు వస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ. 42.82 కోట్లు, ప్రయివేటు సంస్థల నుంచి రూ.210.87 కోట్లు నగదు వస్తుంది. కచ్చితంగా రూ.240 కోట్లు నగదు చెల్లిస్తున్నారు. ఇందులో ప్రయివేటు సంస్థల నుంచి రూ.212 కోట్లు, ప్రభుత్వం నుంచి రూ. 27.69 కోట్లు వస్తుంది. ప్రస్తుతం పెరిగిన ఛార్జీలతో ప్రతి నెలా రూ. 11 కోట్లు అదనపు భారం పడుతుంది. అంటే ఏడాదికి రూ.132 కోట్లు అదనపు భారం పడనుంది. కరెంట్ భారాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు..

ఎకరాకు రూ. 35 లక్షలు ఇవ్వాల్సిందే..

రావూరు గ్రామసభలో రైతులు డిమాండ్

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమల కోసం తీసుకుంటున్న తమ భూములకు పరిహారం ఎకరాకు 35 లక్షలు ఇవ్వాలని రావూరులో జరిగిన గ్రామసభలో రైతులు డిమాండ్ చేశారు. భూ సేకరణ పునరావాస పునః స్థాపన పథకంలో భాగంగా బుధవారం రావూరు గ్రామంలో గ్రామ సభ జరిగింది. ఈ సభకు సర్పంచ్ గొల్లపోలు సుబ్బారాయుడు అధ్యక్షత వహించారు. గుడ్లూరు తహశీల్దార్ జి స్వర్ణ పాల్గొన్నారు. భూసేకరణ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా రైతులు, మాట్లాడుతూ భూములు కోల్పోయినందున, తాము కూలీలుగా మారిపోతామన్నారు. ఈ నేపథ్యంలో తకు ఎకరాకు రూ. 35 లక్షలు ఇవ్వాలన్నారు. 6 కోట్లతో రైల్వే ట్రాక్ అండర్ వేవ్ వేశారని.. కానీ అందులో ఎనిమిది అడుగులు నీరు చేరి, ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఉందన్నారు. దీనికి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పట్టా భూములతో పాటు సమానంగా అసైన్మెంట్ భూములు, చెరువుపోరంబోకు భూములకు నష్టపరిహారం చెల్లించాలని, భూములు కోల్పోతున్న తమకు ఉపాధి కల్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం సమర్థవంతంగా అమలు చేయడంలో భూసేకరణ అధికారి విఫలం చెందారన్నారు. నిర్వాసితులకు నష్టం చేస్తూ, పోర్టు యాజమాన్యానికి మేలు చేసే పద్ధతుల్లో స్పెషల్ కలెక్టర్ పనిచేశారని విమర్శించారు. కొంతమంది రైతులను చేరదీసి, అసైన్మెంట్ భూములకు డబ్బులు ఇస్తూ వారిని ఎరగా చూపి, రైతుల పట్టా భూములు సేకరణ కోసం ప్రయత్నించడం మోసం చేయడమేనన్నారు. ఒక ఎకరాకు బయట వాళ్లకు ఇళ్ల స్థలాల కోసం రూ. 50 లక్షలకు కొనుగోలు చేసి, వ్యవసాయ భూములకు రూ. 16 లక్షల 36వలే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఎకరాకు 35 లక్షల పరిహారం ఇచ్చి, రావూరు సాలిపేట రైతులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహశీల్దార్ జి స్వర్ణ మాట్లాడుతూ స్పందిస్తూ సమస్యలను అర్జీల రూపంలో ఇస్తే ఉన్నతాధికారుల అధికారులకు పంపించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విఆర్ఓ కేశవులు, గ్రామ రైతులు, పోలుబోయిన శ్రీనివాసులు,గొల్లపోలు హరికష్ణ, బాలి బోయిన వెంకట్రావు, మిరియం మురళి, బండారు రామారావు, చాపల శ్రీనివాసులు, అలహరి సుధాకర్, సిపిఎం నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు,కొట్టే వెంకయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు

18.8 అడుగులకు చేరిన రాళ్లపాడు నీటిమట్టం

ప్రజాశక్తి - లింగసముద్రం

ఇటీవల కురిసిన వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం రాత్రి 7 గంటలకు 18.8 అడుగులకు చేరింది. ఫేంగల్ తుఫాను కారణంగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి నీరు చేరుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ చంద్రమౌలి తెలిపారు. రాళ్లపాడు ప్రాజెక్టుకు మన్నేరు,ఉప్పుటేరు నుంచి 400 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నట్లు తెలిపారు. ఎగువ ప్రాంతంలో నీటి ప్రవాహం ఉండడంతో నీటిమట్టం పెరిగే అవకాశముందన్నారు.

'విఎస్‌యు'లో వర్క్‌షాప్

ప్రజాశక్తి -వెంకటాచలం

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "ఏరోసోల్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎమర్జింగ్ ట్రెండ్స్" పై ఒక రోజు వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. విజయ భాస్కర రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత పాల్గొన్నారు. ఉపకులపతి ఆచార్య ఎస్ విజయ భాస్కరరావు మాట్లాడుతూ "ఏరోసోల్ సైన్స్ అనేది సమకాలీన పరిశోధనలో కీలక విభాగంగా మారిందన్నారు. వాతావరణ మార్పులు, ఆరోగ్య పరిరక్షణ, పరిశ్రమల అభివద్ధి వంటి అంశాల్లో దీని పాత్ర చాలా ప్రాముఖ్యతగలదన్నారు. ఇలాంటి వర్క్ షాప్‌లు పరిశోధకులు విద్యార్థులకు కొత్త అవకాశాలు అందించడంలో తోడ్పడతాయన్నారు.రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత మాట్లాడారు. డాక్టర్ ఎం వెంకట రత్నం, డాక్టర్ వి. రవి కిరణ్, డాక్టర్ చైతన్య డి. జైన్ బిఎల్. మాధవన్ మాట్లాడారు. విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, డాక్టర్ ఎ.శివశంకర్, డాక్టర్ యన్.ఒ.గోపాల్, డాక్టర్ వై.విజయ, డాక్టర్ టి.త్రివేణి, డాక్టర్ జి. విజయలక్ష్మి, డాక్టర్ ఆర్ వి ఎస్ ఎస్ నాగభూషణ రావు ,డాక్టర్ సిహెచ్ ప్రసూనా ఉన్నారు.


మాట్లాడుతున్న విసి విజయభాస్కరరావు

యుటిఎఫ్ నాయకుడు
ఎస్‌కె ఖాదర్ మస్తాన్ మృతి
సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

ప్రజాశక్తి-నెల్లూరు


ఖాదర్ మస్తాన్ (ఫైల్)

యుటిఎఫ్ సీనియర్ నాయకులు, నగర కార్పొరేషన్ పిఎంఆర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎస్‌కె ఖాదర్ మస్తాన్ (57)బుధవారం గుండుపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన భౌతికకాయాన్ని మెడికవర్ ఆస్పత్రిలో ఉండడంతో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్ రావు, సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, కత్తిశ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఖాదర్ మస్తాన్ యుటిఎఫ్ ఉద్యమంలోలాగే జన విజ్ఞాన వేదిక, ఇతర ప్రజా సంఘాల్లో చురుగ్గా పనిచేశారన్నారు. నగర కార్పొరేషన్‌లో కీలకంగా పని చేశారన్నారు. చురుకైన కార్యకర్తను పోగొట్టుకున్నామన్నారు. సిపిఎంకు అనేక విధాలుగా తోడ్పాటునందిస్తూ పనిచేశారన్నారు. అలాంటి కామ్రేడ్ హఠాన్మరణం చెందడం బాధాకరమన్నారు. ఖాదర్ మస్తాన్ మృతికి సంతాపం తెలియజేస్తూ జిల్లా కమిటీ తరఫున నివాళులర్పిస్తున్నామని, వాళ్ల కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.యుటిఎఫ్ జిల్లా నాయకులు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-నెల్లూరు 54 డివిజన్ వెంకటేశ్వరపురం టిడ్కో గృహ సముదాయాల వద్ద పారిశుధ్య నిర్వహణ పనులను నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి 15 రోజులపాటు జరగనున్న స్పెషల్ డ్రైవ్ లో భాగంగా పిచ్చి మొక్కలను తొలగించి, ఏపుగా పెరిగిన గడ్డిని తొల గించి ప్రాంగణాలను శుభ్రం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ ఎంహెచ్.ఒ డాక్టర్.చైతన్య తెలిపారు.

పెండింగ్ సమస్యకు పరిష్కారం

ఎంఎల్ఎ 'ఇంటూరి'కి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

ప్రజాశక్తి - లింగసముద్రం

లింగసముద్రం పంచాయతీలో ప్రజలు నివాసముంటున్న సర్వే నెంబర్ 79లో గ్రామ కంఠంలో 18.80 సెంట్లు రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో ప్రజలు గత ఏడేళ్ల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎన్నిసార్లు పాలకులకు ఉన్నతాధికారులకు అర్జీలు ఇచ్చిన సమస్యకు పరిష్కారం కాలేదు. సమస్యను పరిష్కరించేందుకు గతంలో పనిచేసిన వారు సరైన చూపలేదు. నవంబర్ 26న లింగసముద్రంలో జరిగిన మండల సమావేశంలో సర్వే నెంబర్ 79 గ్రామ కంఠంలో రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను గ్రామస్తులు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుకు దృష్టికి తీసుకెళ్లారు. ఆరోజు ఎమ్మెల్యే ప్రజలకు సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే ఈ సమస్య తీవ్రతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలిపారు. వెంటనే స్పందించిన కలెక్టర్ త్వరితగతిన పరిష్కరించేందుకు కషి చేస్తామని ఎంఎల్ఎకు చెప్పారు.కలెక్టర్ సమస్యను పరిష్కరించి సర్వేనెంబర్ 79 లో రిజిస్ట్రేషన్లు జరుపుకునే విధంగా ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్తులు ఎంఎల్ఎ నాగేశ్వరరావుకు కృతజ్ఞలు తెలిపారు.



రౌడీషీటర్ల కదలికలపై నిఘా

ప్రజాశక్తి-నెల్లూరు

నేరచరిత్ర కలిగి, పోలీసు స్టేషన్లలో రౌడీ షీట్ ఓపెన్ చేసిన ప్రతి ఒక్కరి కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని, వారి కదలికలపై ఏ మాత్రం అనుమానం వచ్చినా, నేరాలకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదని పోలీసు అధికారులను ఎస్పి జి.కృష్ణకాంత్ హెచ్చరించారు. బుధవారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామ సందర్శనలు, పల్లె నిద్ర కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు.ఈ నెల 14వ తేదిన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా దష్టి సారించాలన్నారు. జిల్లాలో చోటు చేసుకున్న, పెండింగ్ గ్రేవ్, నాన్ గ్రేవ్, అస్తి సంబంధిత నేరాలలో విచారణ గురించి సర్కిల్ వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్ సౌజన్య, అడిషనల్ యస్.పి. (ఏఆర్) జి. మునిరాజ, ఎస్‌బి, టౌన్, రూరల్, కావలి, ఆత్మకూరు, కందుకూరు,డిటిసి, ఏఆర్ డిఎస్‌పిలు, లీగల్ అడ్వైజర్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు :భారత నావికా దళ దినోత్సవాన్ని పురస్కరించుకోని నగరంలోని జిజిహెచ్‌లో రోగులకు, ప్రసూతి విభాగంలో బాలింతలకు ఎన్‌సిసి నౌకా దళ కేడేట్లు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు మాట్లాడారు."భారత నావికాదళ దినోత్సవం" 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ అండ్ కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొదన్గవే ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలంలోని చినలాటరపీ, నాయుడుపాలెం గ్రామాల్లోని సచివాలయాలను ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాలలోని సిబ్బంది హాజరు, సర్వేలను తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.



కిమ్స్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కిమ్స్ ఆస్పత్రిలో గైనకాలజీ విభాగంలో వైద్యులు అరుదైన చికిత్స చేశారు. బుచ్చిరెడ్డిపాళెం దామరమడుగు గ్రామానికి చెందిన ఆర్నెల్ల గర్భిణి వి. వైష్ణవికి కొద్ది రోజులుగా డెంగీ జ్వరం వచ్చింది. ప్లేట్ లెట్స్ 15 వేలకు పడిపోయాయి. ఆమెను అనేక ఆసుపత్రుల్లో చేర్పించారు. కిమ్స్ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ డాక్టర్ మారం జనిత్య ఊపిరితిత్తుల్లో నీరు చేరడంతో కడుపు ఉబ్బరం, ఊపిరిపీల్చుకోవడం ఇబ్బందిగా మారింది. పరిస్థితి అత్యవసరంగా మారడంతో డాక్టర్లు రవి కిరణ్, వి. జగదీష్, పర్యవేక్షణలో ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. 1.20 లక్షకు ప్లేట్ లెట్స్ పెరిగాయి. ఆమె ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు డాక్టర్లు బుధ వారం మీడియాతో మాట్లాడారు. మహిళ పూర్తిగా కోలుకున్నారు. కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరి నాయుడు వైద్యులను అభినందించారు. తమ ఆస్పత్రిలో ఏదైనా మంచి చికిత్స అందిస్తున్నారని, అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.



రైతులకు సూచనలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జీ. శివన్నారాయణ సూచించారు. బుధ వారం తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచా యతీలోని కోడూరు-1, కోడూరు -2 గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. వ్యవసాయాధి కా రి వివి శిరీష రాణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం లో ఆత్మా పీడీ శివన్నారాయణ మాట్లాడుతూ భూసార పరీక్ష ల ఆధారంగా రసాయన ఎరువుల వాడాలని రైతులకు వివరించారు. గ్రామ వ్యవసాయ స హాయకులు శశి, ఆర్. దయాన, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు :మండలంలో పాలూరు, దొండపాడు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది. బుధవారం నిర్వహించారు. రాము మాట్లాడుతూ ప్రస్తుతం అధిక వర్షాలు కారణంగా వరి మాగాణి పొలాల్లో నీరు నిలబడకుండా కాలువలు తీసుకొని బయటకు పంపాలని తెలిపారు. శనగ వేసే రైతులు భూమి బాగా ఆరిన తర్వాత మాత్రమే విత్తనాలు విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ పర్యవేక్షకులు షేఖ్.ఖాసిం, జూనియర్ పశు వైద్య అధికారి షేక్. వెంకటేశ్వర్లు రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.


కందుకూరులో..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :మండలంలోనిసాలిపేట, మోచెర్ల రైతు సేవా కేంద్రాల పరిదిలోని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు,నాయకులు వ్యవసాయ సహాయకులు షారుఖ్, శైలజ పాల్గొన్నారు.

జెసి మాల్ ఫ్యాషన్ ఫర్ ఆల్
షో రూమ్ ప్రారంభం

ప్రజాశక్తి -నెల్లూరు

మీదుగా జెసి మాల్ ఫ్యాషన్ ఫర్ ఆల్ నూతన షో రూమ్‌ను సినీ నటి ప్రియాంక మోహన్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అబ్బురపరిచే ప్రారంభోత్సవ ఆపర్లతో శారీస్, మెన్స్ వేర్, ఉమెన్స్ వేర్, కిడ్స్ వేర్ ఒకే చోట లభించే అవకాశం కల్పించిన జెసి మాల్ అధినేతలకు కతజ్ఞతలు తెలిపారు. సింహపురి మహిళలు, యువత జెసి మాల్ ను సందర్శించి ఆదరించాలని సూచించారు. జెసి మాల్ ఫ్యాషన్ ఫర్ ఆల్ షోరూమ్ అధినేతలు మర్రి వెంకటరెడ్డి, జమున మాట్లాడుతూ నెల్లూరు నగరంలో ప్రారంభించబడిన జెసి మాల్ లో మగవలు నచ్చదగిన చీరలు, యువతకు నచ్చిన వివిధ రకాల ఫ్యాన్సీ డ్రెస్సెస్ లతోపాటు సాంప్రదాయ వస్త్రాలు, అత్యాధునిక ఫ్యాషన్లతో కుటుంబ సమేతంగా నచ్చదగిన వస్త్ర ప్రపంచం జెసి మాల్ అని సింహపురి ప్రజలు చెప్పుకునే విధంగా అత్యాధునిక డిజైన్లతో, వందలాది వెరైటీలతో నూతన వస్త్రాలు లభిస్తాయని తెలిపారు. నెల్లూరు గ్రామీణ నియె ాజకవర్గం శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ఉన్నారు.


జ్యోతి ప్రజల్వన చేస్తున్న దృశ్యం

'సింహపురికి' రూ.61.62 లక్షలు జరిమానా

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నిర్లక్ష్యంగా శస్త్ర చికిత్స చేసి బాధితుడి కంటి చూపు కోల్పోవడానికి కారణమైన. మెడికవర్ (సింహపురి) హాస్పిటల్ యాజమాన్యానికి రూ.61.62 లక్షలు జరిమానా విధిస్తూ బుధవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జింకా రెడ్డి శేఖర్‌లి తీర్పు ఇచ్చారు.తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన చెవూరు సురేష్ బాబు వృత్తిరీత్యా పంచాయతీ కార్యదర్శి. 2017 మే లో ఆసుపత్రిలో చికిత్స కోసం చేరగా.. అతడిని పరీక్షించిన ఓ వైద్యుడు సైనసైటిస్ శస్త్ర చికిత్స చేసు కోవాలని సూచించగా.. మే 11న సెప్టో ప్లాస్టీ, మినీ ఎఫ్ఈఎస్ఎస్ శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. మే 12 న ఎడమ కంటికి వాపు వచ్చి ఎడమ కంటి చూపు కోల్పోయాడు. తలకు సంబంధించిన పలు సమస్యలు కూడా తలెత్తాయి. అనంతరం చెన్నై అపోలో, బ్రెయిన్ అండ్ స్పైన్ ఆసుపత్రుల్లో లెఫ్ట్ ఫ్రంటో-టెంపోరల్ క్రానియోటమీ, రాడికల్ ఎక్సిషన్, బయోప్సీ శస్త్ర చికిత్సలు చేసుకున్నాడు. దీంతో బాధితుడు వినియోగదారుల కోర్టును ఆశ్రయించాడు. ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి రెడ్డి శేఖర్ సైనసైటిస్ ఆపరేషన్ అప్పుడు మెడికవర్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే బాధితుడు పూర్తిగా కంటి చూపు కోల్పోయాడని, పలు సమస్యలు వచ్చాయని నిర్ధారించాడు. బాధితుడు పలు ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు, మందులు, ఇతర ఖర్చులకు గానూ రూ.21,62,752లు చెల్లించినట్లు బిల్లులు సమర్పించాడు. దీంతో ఖర్చు పెట్టిన రూ.21,62,752లు, శారీరక, మానసిక వేదన ఇతర డామేజస్ కు గాను బాధితుడికి రూ.40 లక్షలు.. మొత్తం రూ.61,62,752లు నష్ట పరిహారం చెల్లించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు లిన్యాయమూర్తి జింకా రెడ్డి శేఖర్‌లి ఆదేశిస్తూ తీర్పు ఇచ్చారు. 45 రోజుల్లో పరిహారం చెల్లించకపోతే తీర్పు వెలువడిన తేదీ నుంచి 9 శాతం వడ్డీతో మొత్తాన్ని చెల్లించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. తీర్పు కార్యక్రమంలో సభ్యురాలు బాలసుధ పాల్గొన్నారు.

'మెడికవర్'కు సంబంధం లేదు..

మెడికవర్ హాస్పిటల్స్ పై వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవం నిరాధారం వినియోగదారుల కోర్టు సింహపురి ఆసుపత్రి గురించి ఇచ్చిన తీర్పును వక్రీకరించి మెడికవర్ హాస్పిటల్స్ కి అన్వయిస్తూ సామాజిక మాధ్యమాలలో, వార్తాపత్రికలలో , టీవీ చానళ్లలో ప్రచురితమవుతున్న కథనాలను మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం పూర్తిగా ఖండించింది. ఈ మేరకు బుధవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో పలు అంశాల మీద వివరణ ఇచ్చింది. ఈ కేసు 2017 వ సంవత్సరానికి చెందినది , అప్పటికి భారతదేశంలో మెడికవర్ హాస్పిటల్స్ సంస్థాగతంగా స్థాపించబడలేదు తద్వారా ఈ కేసు పూర్తిగా సింహపురి హాస్పిటల్స్ కి సంబంధించినది మాత్రమే. కావున ఇలాంటి అవాస్తవ నిరాధారమైన కథనాలను నమ్మవద్దని, ప్రచురించవద్దని కోరుకుంటున్నాము . తదుపరి వివరణలకై మెడికవర్ హాస్పిటల్స్ లీగల్ డిపార్టుమెంటును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి -గుడ్లూరు

విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపాధ్యాయులకు సంబంధంలేని నిరంకుశ నిబంధనలు విధించడంపై మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శి మకిన్ రమేష్ మాట్లాడారు. ఉపాధ్యాయులకి సంబంధంలేని నిబంధనలు విధించడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల హక్కులకు భంగం కలిగిస్తూ సెలవుల్ని 10 శాతానికి తగ్గించడం పై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఇఒ గోవర్ధన్‌కు యుటిఎఫ్ నాయకులు, పాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ మండల కార్యదర్శి నకిన్ రమేష్ తోటి జై వెంకటాద్రి నాయుడు ఎస్.కె రసూల్ బాషా ఎస్ శ్రీనివాసులు సిహెచ్ శ్రీనివాసులు మాధవరావు పాల్గొన్నారు.



అరబిందో సేవ పేరుతో ఘోరాలు
సిబిఐ విచారణ జరగాలి-సోమిరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య సేవలు చేయడానికి ఏర్పాటు చేసిన 108, 104 వాహనాల నిర్వహణలో అరబిందో తీసుకొని ఘోరమైన పాపాలు చేసిందని, సర్వేపల్లి ఎంఎల్ఎ సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడారు. విజయసాయిరెడ్డి కుటుంబ సభ్యులైన అరబిందోకు భారీ మొత్తంలో గత ప్రభుత్వం ముట్టజెప్పిందన్నారు. ఆ సంస్థపై సిబిఐ, సిఐడి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిని తొలుత సత్యం రామలింగరాజు, జీవీకే సంస్థలు 108, 104 సర్వీసులను సమర్థవంతంగా నిర్వహించి రోల్ మోడల్ గా నిలిచాయన్నారు. 2019లో 108, 104 అంబులెన్సుల బాధ్యతను జీవీకే నుంచి అరబిందో సంస్థ చేజిక్కించుకుందన్నారు. ప్రభుత్వం చెల్లించే నిర్వహణ ఖర్చులను అమాంతంగా రెట్టింపు చేశారని విమర్శించారు. ట్రస్టు ఆధ్వర్యంలో సేవా ధకృథంతో అందించాల్సిన సేవలను అరబిందో వ్యాపారమయం చేసేసిందని, ..సేవను వదిలేసి దోపిడీలోకి వెళ్లిపోయారన్నారు.2019 వరకు ఒక్కో 108 అంబులెన్సుకు పాతదైనా, కొత్తదైనా నెలకు జీవీకేకి రూ.1.30 లక్షలు చెల్లిస్తుంటే అరబిందో వచ్చిన తర్వాత పాత వాహనానికి రూ.2.28 లక్షలు, కొత్త వాహనానికి రూ.1.78 లక్షలకు పెంచారన్నారు. 104 అంబులెన్స్‌కు నెలకు రూ.1.80 లక్షలు చెల్లించేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు.104 అంబులెన్స్ నిర్వహణకు సంబంధించి అరబిందో సంస్థ రూ.175 కోట్లు అదనంగా వసూలు చేసిందని అధికారుల విచారణలో తేలిందన్నారు. ఒక్క 104 అంబులెన్సులకు సంబంధించి రూ.175 కోట్లు దోచేస్తే...ఇక 108 అంబులెన్సుల విషయంలో ఎన్ని కోట్లు తిన్నారో లెక్క తేల్చాలన్నారు. పేదల ప్రాణాలు కావా...వందల, వేల కోట్లు దోచుకునే అరబిందో కంపెనీ ప్రతినిధుల ప్రాణాలకు ప్రత్యేకత ఉందా అన్నారు.


మాట్లాడుతున్న సోమిరెడ్డి

కోటంరెడ్డి పాదయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరులు టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి బుధవారం పాదయాత్ర ప్రారంభించారు. స్థానిక 19 విడిజన్‌లోని భారీ జన సందోహం మధ్యలో ఆయన పాద్రయాత్ర కొనసాగింది. ఏడాది పాటు కొనసాగనున్న పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఇంటింటికి వెళ్లి ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ఎలా అందుతున్నాయి. ఏం కావాలని అనే విషయాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాలలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి 4 సార్లు ప్రతి ఇంటికీ వచ్చారన్నారు. ఆయన స్ఫూర్తితోనే గడప గడపకు కార్యక్రమాన్ని ప్రారంభించానన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా తాము నిరంతరం ప్రజలమధ్యలోనే ఉంటామన్నారు. ఒక నమ్మకంతో రూరల్ నియోజకవర్గ ప్రజలు ముచ్చటగా మూడవసారి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే మా అజెండా అన్నారు. టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



ఇనుప స్తంభాలతో ఇబ్బందులు



ప్రజాశక్తి-కోవూరు : కోవూరు గ్రామ పంచాయతీ పరిధిలోని దొమ్మరపాలెం, సాయిబాబా మందిరం వీధిలో కరెంటు ఇనుప స్తంభాలు ఉండడం వల్ల వర్షా కాలంలో ఇబ్బంది కలుగుతుందని ప్రజలు తెలిపారు. ఎడిఇ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఎడిఇ మధుసూదన్ రెడ్డి, ఎఇ మునిరాజా లైన్మెన్ సుధాకర్ వారి ఆధ్వర్యంలో ఈ సమస్యలను త్వరలోనే పరిష్కారం చేస్తామని హామీచ్చారు. వారిదెంద బూత్ కన్వీనర్ నాటకరాజ్ వెంకట్, సెక్షన్ ఇన్‌చార్జులు మన్నేపల్లి బాబు, మన్నేపల్లి రాజేష్, మన్నేపల్లి శంకర్, మన్నేపల్లి రమేష్, తదితరులు ఉన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో టిడిపి పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఆ వార్డు నాయకులతో కలిసి బుధవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనలతో మున్సిపల్ పరిధిలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, ఆత్మకూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సర్దార్, 18వ వార్డు కౌన్సిలర్ గంధర్ల వేణు, కొప్పోలు చిన్నపరెడ్డి, ఎస్‌కె నాయబ్ రసూల్, పట్టణ బీసీ నాయకులు ఒంటేరు మల్లికార్జున యాదవ్, అనిల్, నాగూర్, గురు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'పిఎంఎవై'కు దరఖాస్తు చేసుకోండి..



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పిఎంఎవై-2 పథకం కింద గృహాల కోసం అర్హులైన ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ బజాక్‌ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని దేపూరు ఎస్‌టి కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పిఎంఎవై-2 రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి లబ్ధిదారులకు వివరించారు. ఆయనవెంట హౌసింగ్ ఎఇ శరత్, సచివాలయ ఉద్యోగి అక్బర్ ఉన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : గృహ నిర్మాణాలకు అర్హులైన లబ్ధిదారులు పిఎంఎవైను సచివాలయంలో రిజిస్టర్ చేసుకోవాలని ఎంపిడిఒ బజాక్‌ప్రవీణ్ సూచించారు. బుధవారం ఆయన కామిరెడ్డిపాడు సచివాలయాన్ని సందర్శించారు. బయోమెట్రిక్ హాజరు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది అందరూ బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని తెలియజేశారు. ఎంపిడిఒవెంట కార్యాలయ పరిపాలనాధికారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ పలువురు వికలాంగులను శాలువాలతో సత్కరించి వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆత్మకూరులో మొత్తం 17 వికలాంగ పొదుపు గ్రూపులు ఉన్నాయని, వారికి ప్రభుత్వం ద్వారా రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా వారు అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా టిఎంసి మాధవి, ఆర్‌పిలు, గ్రూపు లీడర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎంఇఒలు రవీంద్రనాథ్, సునీత అల్లూరు బోర్డు స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఎస్.మల్లికార్జున స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు. సెరిబ్రల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో భవిత స్కూల్ టీచర్స్ సునీత, శిల్పా, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా నౌకాదళ దినోత్సవం

ప్రజాశక్తి-కావలి : కావలి వెంగళరావు నగర్‌లోని శ్రీ పొట్టిశ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాలలో 10 ఆంధ్ర నావల్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం భారతీయ నౌకాదళ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ ఉత్సవ సభకు అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్ మాట్లాడుతూ నౌకాదళ విస్తరణ, ప్రాముఖ్యత, ఓడరేవుల వాటి ప్రణాళిక, యుద్ధ సమయాలలో దేశ రక్షణకు ఉపయోగపడే విధానం గురించి క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన పాఠశాల టీచర్లు అధ్యాపకులు కె.ఎస్.కె అంజాద్ అలీ, ఎన్.సి.సి. ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో 2024 జూన్ 20 నుండి జూన్ 29 వరకు విద్యానగర్‌లోని ఎన్.బి.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వార్షిక శిక్షణ తరగతులకు హాజరైన కేడెట్స్‌కు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. నౌకాదళ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, బొమ్మలు గీయటం పోటీల్లో అసమాన ప్రతిభ కనబరిచిన కేడేట్స్ దీక్షిత, పి.జ్ఞానశ్రీ, ఎం.ప్రవలికకు బహుమతులు ప్రదానం చేశారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-వరికుంటపాడు : రబీ సీజన్లో సాగు చేస్తున్న పంటలకు ఈ-పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని రైతులు ఈ పంటతో పాటు పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. వరిసాగు రైతులు 31వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు.

నీట మునిగిన గిరిజన కాలనీ

ప్రజాశక్తి-బిట్రగుంట : మంగళవారం కురిసిన వర్షానికి విశ్వనాథరావుపేట పంచాయతీ గిరిజన కాలనీలోని గిరిజనుల ఇళ్లలోకి నీరు చేరడంతో గిరిజనులు చాలా ఇబ్బందులు పడ్డారు. గురువయ్యగారి తహశీల్దార్ సురేష్‌బాబుకు ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ జిల్లా జాయింట్ సెక్రటరీ రవీంద్ర తెలియజేశారు. గిరిజన కాలనీ సందర్శించిన ఆయన వారికి కావాల్సిన వసతులను భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బత్తుల మల్లికార్జున్, వీఆర్‌ఓ మల్లికార్జున్ స్థానికులు ఉన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : తహశీల్దార్ కార్యాలయంలో నష్టపరిహారం చెల్లించాలంటూ బుధవారం రైతులు అర్జీ సమర్పించారు. రైతులు మాట్లాడుతూ చిరమన గ్రామ చెరువు పరిధిలో ఆయకట్టులో తమ భూములు ఉన్నాయని, కొండయ్య రైతులు వాగు ఎల్లవ కాలువను పూడ్చివేసి ఆక్రమించుకున్నారన్నారు. నష్టపోయిన రైతులు షేక్.బాజాభక్షు, ఎస్‌డి అల్లాభక్షు, పక్కిరెడ్డి, సుబ్రమణ్యం, సురేంద్ర, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వినాయకస్వామి మండపం వద్ద మంగళవారం రాత్రి అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు గురుస్వామి కంది హరికృష్ణ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

కాలువలు ఆక్రమిస్తే చర్యలు



ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : మండలంలోని సాగునీటి కాలువలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి లేఅవుట్లు వేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎంపిడిఒ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం, నగర పంచాయతీలో బుధవారం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం జరిగేటప్పుడు అజెండా కాపీతో పాటు అభివృద్ధి పనుల ఖర్చుల వివరాలు సభ్యులకు అందజేయాలని కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని జిఐటివ గోపాల్ రెడ్డి నగర్‌లో సచివాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. నగర పంచాయతీకి సంబంధించి 117 మంది పారిశుధ్య కార్మికులకు యూనిఫారంతో పాటు శానిటైజేషన్ హెల్త్ కిట్లను కూడా అందజేసి వారి సేవలు అమూల్యమన్నారు. కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, బుచ్చి అర్బన్, రూరల్ అధ్యక్షులు ఎంవి శేషయ్య, బత్తల హరికృష్ణ, కౌన్సిలర్లు, ఎర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, శివకుమార్ నాయుడు, విజయ రామనాయుడు, మహేష్ పాల్గొన్నారు.

నగదు అందజేత



ప్రజాశక్తి-ఉదయగిరి : శుభిమలైకు చెందిన అయ్యప్ప స్వాములకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి నగదును అందజేసి పూలమాలతో సత్కరించారు. బుధవారం స్థానిక ట్యాంక్ బండ్ పై శుభిమలకు వెళు తున్న అయ్యప్ప స్వాములకు పూల మాలలు వేసి వారి ఆశీస్సులు అందుకున్నారు. స్వామివారి దర్శనం చేసుకొని తిరిగి సంతోషంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. అనంతరం జల వనరుల శాఖ డిఇ చంద్రమౌళిని కలిసి అనకట్ట ఆధునీకరణలో భాగంగా డ్రైనేజ్ వాటర్‌ను పూర్తిపై చేసే ఆధునాతనమైన తక్కువ ధరతో నూతన టెక్నాలజీ ఉన్న పరికరాలతో సుందరీకరణ పనులు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గువ్వారు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, రామయ్య, లక్ష్మయ్య, సురేష్, నారాయణరెడ్డి, గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహశీల్దార్ భవనం

- భయాందోళనలో అధికారులు, ప్రజలు




పెచ్చులూడుతున్న తహశీల్దారు కార్యాలయం

ప్రజాశక్తి-సైదాపురం

అదో మండల రెవెన్యూ కార్యాలయం. కానీ అక్కడ విధులు నిర్వహించాలంటే అధికారులు భయంతో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఎప్పుడు ఏమవుతుందోననే ఆందోళనతో నెట్టుకురావాల్సి వస్తోంది. రెవెన్యూ కార్యాలయం భవనం ఎప్పుడు పెచ్చులూడి పడుతుందోనని భయాందోళనలో అధికారులు ఉన్నారు. పైకప్పు వర్షపు నీటితో నాచు పట్టిన గోడలు, చెదలు పడుతున్న విలువైన దస్తావేజులు, పగిలిపోయి నడిచేందుకు ఇబ్బందిపడేలా ఫ్లోరింగ్ గచ్చు ఇలా ఉండడం వల్ల ప్రత్యక్షమయ్యే పాములు, తేళ్లు, గదులు ఆవరణమంతా గడ్డిగ్రాసంతో పనికిరాని మొక్కలున్నాయి. శిథిలావస్థకు చేరిన పాడుపడ్డ భవనం. ఇదీ నెల్లూరు జిల్లా సైదాపురం మండలం, తహశీల్దార్ కార్యాలయం దుస్థితి. పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుని ఉన్న భవనం ఇక్కడ వందల కోట్ల విలువైన ప్రభుత్వ ప్రయివేటు భూములు కలిగిన దేశంలోనే మైకాకు పేరుగాంచిన సైదాపురం తహశీల్దార్ కార్యాలయం తలమానికగా నిలుస్తోంది. ఇది చాలా పురాతన భవనం. రెండు మూడు రోజుల పాటు వర్షాలు పడితే పెచ్చులూడుతుంటాయి. విష సర్పాల బెడద ఎక్కువగా ఉంది. వర్షాలు ఎక్కువగా ఉంటే చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది. సరైన వెసులుబాటు లేక బయటకు చెప్పలేక ఇబ్బంది తాళలేక బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. బయట వ్యక్తులెవరైనా వస్తే ఇది ప్రభుత్వ కార్యాలయమా వినియోగంలో లేని శిథిలావస్థకు చేరిన ఇల్లా అనేలా ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ కోట్ల రూపాయల విలువైన మైనింగ్ జరుగుతుంటాయి. అటువంటి ఈ ఆఫీసును ఎవరూ పట్టించుకోవడం లేదు. అభివృద్ధికి మారుపేరు కూటమి ప్రభుత్వంలోనైనా నూతన భవనం ఏర్పాట్ల దిశగా ముందుకు అడుగులు వేసేనా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎంఇఒకు యుటిఎఫ్ వినతి



ఎఎస్‌పేటలో..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిధిలోని స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలోని ఎంఇఒ ఎం.జ్యోతికి ఎపి యుటిఎఫ్ మండల శాఖ అర్జీని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు పెద్దగా తేడా లేదనే విధంగా విద్యాశాఖ అధికారులు నిర్ణయాలు ఉంటున్నాయని, పాఠశాలలో పనివేళలు పెంపు, 10శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని ఆంక్షలు, పదవ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజులు యాక్షన్ ప్లాన్ విద్యార్థుల వివరాలు అపారులు నమోదు, ఇలా ప్రతి నిర్ణయం అసంబద్ధంగానే ఉంటున్నాయన్నారు. అనారోగ్యం బారిన పడిన వారికి సైతం సెలవులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఈ అసంబద్ధత నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్‌తో 4వ తేదీ అన్ని విద్యాశాఖ అధికారులకు నోటీసులు, 11వ తేదీ జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన, 16వ తేదీ రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేయతల పెడుతున్నామని తెలిపారు. కావున ఉపాధ్యాయులను ఒత్తులు లేని వాతావరణంలో స్వేచ్ఛగా పనిచేసే విధంగా అధికారుల నిర్ణయాలు ఉండాలని తెలియజేశారు.

ప్రజాశక్తి-కోవూరు : విద్యాశాఖ తీసుకొంటున్న పలు అసంబద్ధ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎంఇఒకు బుధ వారం యుటిఎఫ్ మండల శాఖ వినతి పత్రాన్ని అందజేసింది. అధ్యక్షులు కెఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు డి.పుష్పలత, మండల కార్యకర్తలు ఎంవి సుబ్రమణ్యం, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కోవూరులో..

స్థల పరిశీలన



ప్రజాశక్తి-అనంతసాగరం

మండల కేంద్రంలోని గిరిజన కాలనీ వాసులకు శ్మశాన స్థలం కేటాయించడం కోసం సిపిఎం నాయకులు, గిరిజన కాలనీ వాసులతో కలిసి రెవెన్యూ అధికారులు స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ గిరిజన కాలనీవాసులకు కాలనీ ఏర్పడినప్పటి నుండి శ్మశాన స్థలం లేక ఇబ్బందులు పడుతుండే వారు, ఎవరైనా కాలనిలో చనిపోతే కాలనికి పక్కనే ఉన్న అడవిలోనే మృతదేహాలను ఖననం చేసుకొనేవారని తెలిపారు. అక్కడ అటవీ శాఖ వారితో ఇబ్బందులు ఉండటం వల్ల గిరిజనులకు ప్రతేక శ్మశాన స్థలం కేటాయించాలని సిపిఎం ఆధ్వర్యంలో అనేకమార్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తహశీల్దార్‌కు, ఆత్మకూరు ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్‌కు గిరిజనులకు శ్మశాన స్థలం కేటాయించాలని అనేకమార్లు వినతిపత్రాలు అందజేశామన్నారు. సమస్యపై స్పందించిన అధికారులు బుధవారం ఆత్మకూరు ఆర్‌డిఒ మండల తహశీల్దార్ సూచనల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్ 1019లో గిరిజనులకు, రాజునగర్ కాలనీ వాసులకు శ్మశాన స్థలం కేటాయించడానికి స్థలాన్ని పరిశీలన చేశామన్నారు. శ్మశాన స్థలంలో త్వరగా హద్దులు ఏర్పాటు చేసి ఇవ్వాలన్నారు. అనంతసాగరం గ్రామ విఆర్‌ఒ రాజేశ్వరీ, సర్వేయర్ విజయ్, సిపిఎం మండల కమిటీ సభ్యులు వేము పెంచలయ్య, గిరిజన కాలనీ సిపిఎం కార్యదర్శి నాగులూరు వెంకటేష్, అంకయ్య, వెంగయ్య,కొండయ్య, శీనయ్య, గిరిజనకాలనీ వాసులు, బొర్రా పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-కావలి : సిపిఎం జిల్లా 25వ మహాసభలు 7, 8 తేదీలలో ఇందుకూరుపేటలో జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని కావలి పట్టణ సిపిఎం కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పనిచేసేందుకు ఈ మహాసభలలో చర్చించుకొని ప్రజా పోరాటాలకు ఈ మహాసభ పిలుపునిస్తుందన్నారు. మహాసభలో మొదటి రోజు సాయంత్రం భారీ ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందని ఈ బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం, పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ఇంకా మరి కొంతమంది ఈ బహిరంగ సభలో ప్రసంగిస్తారని వివరించారు. ప్రజలు కార్మికులు రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని పసుపులేటి పెంచలయ్య పిలుపునిచ్చారు.

పుస్తకాలను నేస్తాలుగా చేసుకోండి..



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-కావలి : స్థానిక వెంగళరావు నగర్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు "పరకాష్ రాష్ట్రీయ సర్వేక్షణ్- 2024" భాగంగా నేషనల్ అచీవ్మెంట్ సర్వే భాగంగా 9 వతరగతి విద్యార్థులు 91 మందికి గానూ, ప్రణాళికాబద్ధంగా 30 మందిని ఎంపిక చేసి, పరీక్షను బొగ్గుల.అనిత పర్యవేక్షణలో ఓ.రమేష్ బి.ఇ.డి.ట్రైనీటీచర్ నిర్వహణ జరిగే సందర్భంగా కావలి ఎంఇఒ బండి గోవిందయ్య విచ్చేసి, పరీక్ష జరిగే తీరు తెన్నులను పరిశీలన చేశారు. ప్రధానోపాధ్యాయులు సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్, ఐ.శ్రీనివాసులు, బి.శాంతకుమారి, సిఆర్‌పి నాగలక్ష్మి పాల్గొన్నారు.

కరెంటు ఛార్జీలను తగ్గించాలి



మాట్లాడుతున్న తాళ్లూరు మల్యాద్రి

ప్రజాశక్తి-బిట్రగుంట

ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలు సబ్ ఛార్జీల పేరుపై ప్రజలపై అధిక భారం మోపుతుందని, పెరిగిన ఛార్జీలను తగ్గించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి పేర్కొన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా ప్రజాశక్తి ప్రత్యేక శీర్షిక విడుదల చేసిందని, దానిని ప్రజల దృష్టికి తీసుకుని వెళ్లడానికి బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.మాల్యాద్రి, మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, వ్యకాసం జిల్లాకమిటీ సభ్యులు ఎం.రాధా కృష్ణయ్య, సిపిఎం కార్యాలయం నుండి ఇబ్రహీం పేట, చిన్నబజారు, పెద్ద బజారు దుకాణదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అదాని చేసిన భారీ స్కాం గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అదాని దగ్గర రూ.1750 కోట్లు లంచం తీసుకుని, వేలాది కోట్లకు కుంభకోణం పాల్పడ్డారని మాట్లాడుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కుంభకోణంపై నరేంద్ర మోడీని ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ



ప్రజాశక్తి-కొడవలూరు

విడవలూరు మండలంలోని బొడ్డువారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం సూపర్‌వైజర్ నాగభూషణమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రజా ఆరోగ్యంపై స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో తీసు కోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. గర్భిణీ రాములమ్మకు శ్రీమంత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి కౌన్సిలర్లు చేరిక



కౌన్సిలర్‌లను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీ టిడిపి కార్యాలయంలో పట్టణ నాయకుల ఆధ్వర్యంలో 1వ వార్డు కౌన్సిలర్ మొలబంటి రాజశేఖర్, 2వ వార్డు కౌన్సిలర్ దగ్గుబాటి శివకోటారెడ్డి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కౌన్సిలర్లు మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం వైసిపిని వీడామన్నారు. రాష్ట్ర దేవాదాయ ధర్మదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆకర్షితులై పార్టీలో చేరామని తెలిపారు. ఆత్మకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇంకా భారీ చేరికలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి, 3వ వార్డు కౌన్సిలర్ గౌస్‌బాషా, 9 వార్డు కౌన్సిలర్ రమాదేవి, 22వ వార్డు కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులు నాయుడు, 18వ వార్డు కౌన్సిలర్ గంధర్ల వేణు, రాష్ట్ర మహిళా కార్యదర్శిరాలు పులిమి శైలజారెడ్డి, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కొప్పోలు చిన్నపరెడ్డి, బీసీ నాయకులు తోడేటి వెంకటయ్య యాదవ్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-కావలి

అక్రమంగా తరలిస్తున్న 120బస్తాల రేషన్ బియ్యం లారీని బుధవారం కావలి తహశీల్దారు పి.శ్రావణ్ కుమార్ పట్టుకున్నారు. స్థానిక వెంగాయగారిపాలెం వద్ద బుధవారం స్వాధీనం చేసుకున్న తహశీల్దారు బియ్యం లారీని ఆయన ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. సమాచారం మేరకు అక్రమంగా తరలుతున్న పి.డి.ఎస్. బియ్యాన్ని పట్టుకుని ఒకటో పట్టణ పోలీసులకు కేసు దర్యాప్తు చేసేందుకు అప్పగించామని, వివరాలు తెలియాల్సి ఉందని తహశీల్దారు మీడియా ప్రతినిధులకు తెలియజేశారు.



వంటేరుకు కాకర్ల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-వింజమూరు

కావలి మాజీ ఎంఎల్ఎ వంటేరు వేణుగోపాల్ రెడ్డికి ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ తెలిపారు. వింజమూరులోని టిడిపి ప్రధాన కార్యాలయంలో వంటేరు వేణుగోపాల్ రెడ్డికి పుట్టినరోజు సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు మధ్యలో కేకును కట్ చేసి ఆయనకు తినిపించారు. కావలి నియోజకవర్గంలోని మచ్చలేని రాజకీయ నాయకుడిగా పేరు తెచ్చుకున్న వంటేరు వేణు గోపాల్ రెడ్డి చాలా గొప్ప వ్యక్తిగా కొనియా డారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులున్నారు.

6న జాబ్‌మేళా

ప్రజాశక్తి-కావలి : ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్తంగా 6వ తేదీన కావలి పి.జి. కాలేజీలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 2 గంటల వరకు "జాబ్‌మేళా" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ముతూట్ ఫిన్ క్రాప్, బ్లూ స్టార్ క్లైమేటెక్ లిమిటెడ్, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంక్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించాలన్నారు. కావున నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఈ సదవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా స్కిల్డెవలప్ మెంట్ ఆఫీసర్ అబ్దుల్‌ఖయ్యూం, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వినయ్ కుమార్, పిజి సెంటర్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలియజేశారు. వివరాలకు ఫోన్ 6301 543185, 7286822789 సంప్రదించాలన్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు మండల రెవెన్యూ అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు పమిడిపాడు, సాయంత్రం 5 గంటలకు నబ్బినగరం, 7న వాశిలి, నెల్లూరుపాళెం, 10న నాగులపాడు, నారంపేట, 13న బోయలచిరువెళ్ల, చిరువెళ్లకండ్రిక, 17న కరటంపాడు, ఆరవీడు, 19న అప్పారావుపాళెం, బట్టేపాడు, 21న మసిమలూరు, రామస్వామి, 26న గండ్లవీడు, బొటికర్లపాడు, 28న నువ్వురుపాడు, జంగాలపల్లి, 31న పడకండ్ల, కనుపూరు పల్లి, జనవరి 2న దేపూరు, బండారుపల్లి, 4న ఆత్మకూరులో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలియజేశారు.

ప్రజాశక్తి-దగదర్తి : మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సును జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ పి.కృష్ణ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సదస్సులో 6వ తేదీ నుంచి వచ్చే జనవరి 8వ తేదీ వరకు ఆయా గ్రామాల సచివాలయం, పంచాయతీ కార్యాలయాలు, ఎంపియుపి పాఠశాలలో, ఉదయం 10 గంటల నుంచి 4గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు వినతిలు స్వీకరించేందుకు శుక్రవారం నుంచి జనవరి 3వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ హేమంత్ కుమార్ తెలిపారు. రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో 6వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల రెవెన్యూ అధికారిని స్ఫూర్తిరెడ్డి తెలిపారు. రెవెన్యూ పరంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం గ్రామ సభలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



బహుమతులు, ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

క్రీడల్లో వ్యవసాయ విద్యార్థులు విజయం

ప్రజాశక్తి-ఉదయగిరి : మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యవసాయ కళాశాలలో 2, 3వ సంవత్సరం వ్యవసాయ విద్యార్థులు అంతర్ కళాశాలల క్రీడలలో గెలుపొంది బహుమతులు సాధించారని అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మొదటి దశ ఎస్వి వ్యవసాయ కళాశాల తిరుపతి రెండోదశ వ్యవసాయ కళాశాల బాపట్లలో చివరి దశ వ్యవసాయ కళాశాల నైరా ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ గేమ్స్ కల్చరల్ అండ్ లిటరరీ మీట్ 2024-25 సంవత్సరానికి జరిగిన క్రీడల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని చదువుతోపాటు వ్యాయామం ఆటలలో రాణించాలని పలు సూచనలు అందించి విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థి కార్యకలాపాల అధికారి డాక్టర్ టి.గోపికృష్ణ, గర్ల్స్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ సునీత, జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ జి రమేష్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ కిషన్ తేజ, ఫిజికల్ డైరెక్టర్ రమణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కమల ప్రియ, డాక్టర్ మనోజ్, డాక్టర్ శోభ, డాక్టర్ మాధవి, డాక్టర్ రాజేశ్వరి, బోధన, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు సిఐ గంగధర్ రావుతో పాటు ఆత్మకూరు, మర్రిపాడు ఎస్ఐలకు ఎస్‌పి కృష్ణకాంత్ బుధవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇటీవల అనంతసాగరం మండల పరిధిలో ఇటీవల భారీ ఎత్తున పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి నిర్వహించి సుమారు రూ.8లక్షల నగదును వాటితో పాటు మూడు కార్లు 15మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసిన ఘటనపై వారిని అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఆత్మకూరు పోలీస్ డివిజన్ పరిధిలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఇంత భారీఎత్తున నగదు పట్టుకోవడంపై వీరిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిని డిఎస్‌ఐ వేణుగోపాల్ అభినందించారు.

ఆధునికీకరణ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి ఆనకట్ట (ట్యాంక్ బండ్) ఆధునికీకరణ పనులను బుధవారం మాజీ ఎఎంసి చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.9 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఈ పనులు పూర్తి అయితే ఉదయగిరికి నూతన శోభ చేకూరుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి పని అనుకున్న సమయానికే జరుగుతుందని పనుల జాప్యం ఉండదని ఉదయగిరి ప్రజల చిరకాల కోరిక ఎంఎల్ఎ కాకర్లతోనే త్వరలోనే నెరవేరుతుందన్నారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు అన్నిరకాల హంగులతో ట్యాంక్ బండ్ రూపుదిద్దుకుంటుందని అనంతరం పలు సమస్యలను ఆయన కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మట్ల రామయ్య, లక్ష్మయ్య, నారాయణరెడ్డి, గంగాధర్, నాయకులు వెంకటేశ్వర్లు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్ష



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపిడిఒ అధ్యక్షతన ఉపాధి హామీ సిబ్బందికి వారాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఒ ఫీల్డ్ అసిస్టెంట్లకు కొన్ని ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిపిలలో వెంటనే కాటిల్ షెడ్ మార్కింగ్ అని ఇచ్చి పనులు ప్రారంభించాలన్నారు. కొత్త పనుల ప్రతిపాదనలకు కచ్చితంగా గ్రామసభలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో ఎపిఒ సునీల్, టిఎలు, టెక్నికల్ అసిస్టెంట్ రాఘవ పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి



ప్రజాశక్తి-కావలి : కావలి నియోజక వర్గంలో రామన్న చెరువుపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న చిన్నపాటి అన్నదాత లను ఆదుకోవాలని కావలి నియోజకవర్గ, జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ అళహరి సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, తన దృష్టికి వచ్చిన రైతన్నల గోడు వివరిస్తూ ప్రకృతి వైపరీత్యాలకు ఎవ్వరూ కూడా ఎదురొడ్డ లేరని తెలిపారు. దానికి తోడు రామన్న చెరువుకు ఉత్తర భాగంలో ఉండే ఎల్లు కాలువ గత కొంతకాలంగా శుభ్రపరిచే నాథుడే లేడన్నారు. ఈ విషయం డి.ఇ. ఇరిగేషన్ దృష్టికి తీసుకొని వెళ్లగా ఆయన కానీ, అల్లూరు ఎ.ఇ.లలో కానీ ఏమాత్రం చలనం లేదన్నారు. కారణం తెలియదన్నారు. అదే విషయం డి.ఇ.డ్రైన్స్ దృష్టిలోకి సదరు రైతన్నలు విన్నవించుకొంటే ఆమె యుద్ధ ప్రాతిపదికన మంగళవారం వచ్చి, సదరు రైతన్నలను కలిసి, ప్రభుత్వంతో మాట్లాడి నిర్ణయం తీసుకొంటామని మాట ఇచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని ఎంఎల్ఎ దృష్టికి కూడా తీసుకెళ్లి త్వరలో ఈ రైతన్నల బాధలు తీరే విధంగా చర్యలు తీసుకుంటా మని మాట ఇచ్చినట్లు తెలియబరిచారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని పడమటి నాయుడు పల్లి, చుంచు లూరుల్లోవ్యవసాయ అధికారి ఎస్.రామ్మోహన్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు వి.సురేఖ, కె.కిరణ్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని సాగులో ఉన్న మొక్క జొన్నలో కత్తెర పురుగును ప్రాథమిక దశలో గుర్తించి ఏ విధంగా నివారించు కోవాలో తెలియజేశారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని పాతదేవరాయపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయంలో జీవ సంబంధ ఎరువులు, పురుగు మందుల గురించి అవగాహన కల్పించారు. ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ మాట్లాడుతూ వివిధ పంటలలో శత్రు, మిత్ర పురుగుల గురించి వివరించారు. కార్యక్రమంలో విఎఎలు బాషా, శివారెడ్డి, దివ్యశ్రీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : రైతులందరూ పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారిని సిహెచ్ఎస్ లక్ష్మి కోరారు. ఆమె బుధవారం మండలంలోని కమ్మపాలెం ప్రజల పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులందరూ నీట మునిగిన వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించాలన్నారు.